క్లుప్తంగా

పాడితోనే ఆర్థిక వృద్ధి



పాడిరైతులకు బోనస్ అందజేస్తున్న డెయిరీ మేనేజర్ బ్రహ్మయ్య

మిడుతూరు: పాడితోనే పాడి రైతులు ఆర్థిక వృద్ధి సాధించవచ్చని గ్రామ సర్పంచ్ పాపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విజయ పాల డెయిరీ పీరుసాహెబ్ పేట పాల ఉత్పత్తి దారుల సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలపరిధిలోని పీరుసాహెహ్ పేట గ్రామంలోని విజయపాల డెయిరీలో 60 మంది పాడిరైతులకు హాట్‌బాక్స్‌లు, బోనస్ కింద కొంత మొత్తాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు కనుమరుగతున్నారని, వారిని ప్రోత్సహించి పాల ఉత్పత్తులను పెంచేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమలంలో విజయడెయిరీ మేనేజర్ బ్రహ్మయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, రైతులు ఎల్లనాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై అధికారుల విచారణ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

వెలుగోడు: మండల పరిధిలోని అబ్దుల్లాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై ఉన్నతాధికారులు గురువారం విచారణ చేపట్టారు. గ్రామంలో జరుగుతున్న పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నారని రెండు రోజులక్రితం గ్రామ సర్పంచ్ అంబాల నాగలక్ష్మమ్మ అధికారులకు ఫిర్యాదు చేశారు. 44 మంది కూలీలు ఉపాధి పనులకు రాకపోయినా మస్టర్ వేసుకొని డబ్బులు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఏపీడీ అన్వరా బేగం, ఎంపీడీఓ షేక్ అమానుల్లా, ఏపీఓ మల్లికార్జున, ఈసీ రామచంద్రుడు పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. 44 మంది కూలీల్లో 24 మంది పని చేస్తున్నామని రాతపూర్వకంగా అధికారులకు తెలిపారు. సమగ్రంగా విచారణ చేపట్టి పీడీకి నివేదిక అందిస్తామని ఏపీడీ అన్వరాబేగం తెలిపారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పందెం

మిడుతూరు: మండల పరిధిలోని పైపాలం గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించిన పొట్టేళ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను ఎస్‌ఐ మారుతిశంకర్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 14 పొట్టేళ్లు వచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. ఈ పోటీల్లో బేతంచెర్ల మండలం యంబాయి గ్రామానికి చెందిన రాజు పొట్టేలు ప్రథమ స్థానంలో నిలిచి రూ.10,116, పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన షేక్షావలి రెండో స్థానంలో రూ. 6,116, దామగట్ల గ్రామానికి చెందిన వరుణ్ మోయిద్దీన్ పొట్టేలు మూడో స్థానంలో నిలిచి రూ. 4,116 అందుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రుడు, ఉపసర్పంచ్ రామకృష్ణ, నిర్వహకులు రామేశ్వరుడు, శేఖర్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సబా

జూపాడుబంగ్లా: మండలంలోని చాబోలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రాథమిక వైద్యురాలు డాక్టర్ సబా గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. కేంద్రంలో 15మంది చిన్నారులు విద్యను అభ్యసిస్తుండగా అందరినీ పరీక్షించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మంజులవాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ, సీహెచ్‌ఓ వహాబ్ పాల్గొన్నారు.

వెండి పాత్ర బహూకరణ

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామంలో వెలసిన శ్రీశంకరమల్లేశ్వరస్వామికి గ్రామానికి చెందిన కాశిబోయిన వెంకటేశ్వర్లు, సుజాతమ్మ దంపతులు కిలో వెండి ధారపాత్రను గురువారం అందజేశారు. రూ.80వేల విలువైన కిలో వెండి ధారపాత్రను తెచ్చిన కాశిబోయిన వెంకటేశ్వర్లు, సుజాతమ్మ దంపతులు, వారి సంతానం వెంకట అశోక్ కుమార్, సుకన్యలను అర్చకులు రామ్మూర్తిశర్మ, శ్రీనివాస్‌శర్మ సాదర స్వాగతం పలికారు. కాశిబోయిన వేణుగోపాల్, కడియం మల్లికార్జున, అరవిందు, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు సన్నద్ధంగా ఉండాలి

పగిడ్యాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధంగా ఉండాలని తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ సుభాన్‌లు సూచించారు. గురువారం లక్ష్మాపురం అంచె వద్ద ఉన్న అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయం, స్థానిక కేజీబీవీ పాఠశాలలను సందర్శించి విద్యార్థినులకు మనోధైర్యాన్ని నింపారు.

శ్రీశైలంలో ముగిసిన ఉగాది మహోత్సవాలు

- ఐదురోజుల్లో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న 6 లక్షలకు పైగా భక్తులు
- కన్నడ భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేసిన దేవస్థానం
- సంప్రదాయాన్ని అనుసరించి కైంకర్యాలు



అశ్వవాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో ఊరేగిస్తున్న దృశ్యం



స్వామిఅమ్మవార్లకు విశేషవాహనసేవ



పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగిన ఉగాది మహోత్సవాలు గురువారంతో పూర్ణాహుతితో ప్రశాంతంగా ముగిశాయి. శ్రీగిరి చేరుకున్న కన్నడ భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత సౌకర్యాలు కల్పించింది. ఉత్సవాల ఐదు రోజుల్లో 6 లక్షలకు పైగా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఉత్సవాల్లో ఆయా పూజా కార్యక్రమాలు, అమ్మవారికి విశేష అలంకరణ, స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు తదితర కైంకర్యాలన్నీ సంప్రదాయన్ని అనుసరించి శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీగిరి చేరుకున్న కన్నడ భక్తుల కోసం దేవస్థానం తాత్కాలిక వసతి, దర్శన సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలను కల్పించింది.

శాస్త్రోక్తంగా విశేష పూజలు

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజు అమ్మవారికి విశేష అలంకరణ, స్వామిఅమ్మవార్లకు విశేష వాహనసేవ తదితర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రభోత్సవం, అగ్నిగుండ ప్రవేశం, వీరాచార విన్యాసాలు, పంచాంగ శ్రవణం, రథోత్సవం కనుల పండుగగా సాగాయి.

10 రోజుల పాటు మల్లన్న స్పర్శ దర్శనం

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకని ఈ నెల 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 10 రోజుల పాటు కన్నడ భక్తులకు మల్లన్న స్పర్శదర్శనాన్ని కల్పించాలని దేవస్థానం నిర్ణయించింది. కన్నడిగులు మల్లన్న స్పర్శ దర్శనం కోసం ఉగాది ఉత్సవాల కంటే ముందుగానే క్షేత్రానికి చేరుకుని స్వామివారి స్పర్శ దర్శనం చేసుకున్నారు.

భారీ భద్రత

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పర్యవేక్షణలో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. 700 మంది సివిల్ పోలీసులు, 60 మంది స్పెషల్ పార్టీ, 2 ప్లాటూన్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, 47మంది బీడీ టీం, 130 మంది ఏపీఎస్పీ పోలీసులు, 300 మంది కర్ణాటక పోలీసులతో పటిష్ఠ బందోబస్తు చేపట్టారు.

పెండింగ్ కేసులను పరిష్కరించండి



వెలుగోడు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

వెలుగోడు: పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం వెలుగోడు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను ఎస్‌ఐ జగన్‌మోహన్ అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని చట్ట పరిధిలో సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పీడీఎస్ రైస్, గుట్కా అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి అరికట్టాలని ఆదేశించారు. సైబర్ నేరాలు జరుగకుండా మహిళా పోలీసులు, వలంటీర్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్‌ఐను ఆదేశించారు.

పాములపాడులో సప్తాహం

పాములపాడు: సప్తాహం నిర్వహించడం గ్రామానికి మంచిదని పురోహితుడు నవీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సప్తాహం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 7 రోజుల పాటు 24 గంటలు ఓం నమో నారాయణాయ అనే మంత్రం జపించడం జరుగుతుందని వివరించారు. గ్రామానికి చెందిన భక్తులు ఈ మంత్రోచ్చారణలో పాల్గొన్నారు. అంతకు మునుపు శ్రీరాములు, సీతా దేవి, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలను శ్రీచౌడేశ్వరీదేవి ఆలయం నుంచి రామాలయ ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసిన అనంతరం మంత్రోచ్చరణ ప్రారంభించారు. బృందాల వారీగా పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా నారాయణ నామ స్మరణ కొనసాగుతుంది. కార్యక్రమం శ్రీరామ నవమి పండుగ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

26న దుద్యాలలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో ఈనెల 26వ తేదీన శ్రీ లక్ష్మీ సమేత వేణుగోపాల స్వామి, శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా వృషభాలకు రాష్ట్ర స్థాయి పాలబండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గురువారం కార్యవర్గ సభ్యులు పాములేటి, యుగంధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పందెంలో పాల్గొనే వృషభాలు 4 పండ్లలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు 26వ తేదీ ఉదయం 8 గంటలలోపు ప్రవేశ రుసుము రూ.500 చెల్లించి కమిటీ వారు ఇచ్చే చీటీలను పొందొచ్చని చెప్పారు. విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.18వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ. 3 వేలు, రూ.2వేలు బహుమతిగా అందజేస్తామన్నారు. వివరాలకు 9908750281, 9550996737 నంబర్లను సంప్రదించాలన్నారు.

కన్నడిగులతో కిక్కిరిసిన మహానంది



నంది ఎదురుగా నిండిపోయిన వాహనాలు

- లక్షలాదిగా తరలివచ్చిన కన్నడిగులు
- రెండురోజుల పాటు నిరంతర దర్శనం
- ఆలయానికి రెండు రోజుల్లో రూ. 20లక్షలకు పైగా ఆదాయం



నంది సర్కిల్ వద్ద కన్నడ భక్తజనసందడి

మహానంది: లక్షలాది సంఖ్యలో వచ్చిన కన్నడిగులతో మహానంది ఆలయం కిక్కిరిసిపోయింది. వేలాదిగా తరలివచ్చిన వాహనాలతో నంది ఎదురుగా ఉన్న దేవస్థానానికి చెందిన సుమారు పది ఎకరాల స్థలం, పార్వతీపురం వైపు ఉన్న స్థలాల్లో వాహనాలు నిండిపోవడంతో రోడ్డుకిరువైపులా కన్నడిగులు వారి వాహనాలను నిలుపుకోవాల్సి వచ్చింది. వివిధ ఆర్జిత సేవా విభాగాల ద్వారా రెండురోజుల్లో ఆలయానికి రూ.20లక్షలు ఆదాయం సమకూరింది. శ్రీశైలంలో జరిగిన రథోత్సవం అనంతరం కన్నడిగులు అక్కడి నుంచి మహానందికి తరలివచ్చారు. బుధవారం వేకువజామున నుంచి గురువారం రాత్రి వరకు రెండ్రోజుల పాటు మహానందీశ్వరుడి నిరంతర దర్శనం కొనసాగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓ ఎర్రమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారంగా ఆర్జిత సేవా టికెట్లు

ఎంతో భక్తిశ్రద్ధలతో పాదయాత్ర, వాహనాల ద్వారా కర్ణాటక నుంచి తరలివచ్చే భక్తులకు ఆర్జితసేవా టికెట్లు భారంగా మారాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కేవలం రూ. 50 ఆర్జిత సేవాటికెట్లు మాత్రమే ఇవ్వడంతో దర్శనం పేద భక్తులకు భారంగా మారింది. 22వ తేదీ 5 వేలకు పైగా రూ.50 ఆర్జిత సేవా టికెట్ల ద్వారా రూ. 2.76లక్షలు, 23వ తేదీ సుమారు 14వేలకు పైగా టికెట్లు విక్రయించడంతో రూ. 7.37లక్షలు కలిపి కేవలం రూ.50 ఆర్జిత సేవాటికెట్ల ద్వారా రూ. 10.13లక్షలు ఆదాయం సమకూరింది. వీటితో పాటు రూ. 30, రూ. 20, రూ.10 టికెట్లు జారీ చేశారు. తాత్కాలిక దుకాణాలు, హుండీ కానుకలు, ప్రసాదాల విక్రయాలు, వసతి విభాగాల ద్వారా కేవలం రెండ్రోజుల్లో రూ. 20లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.



స్వామివారి గ్రామోత్సవం

స్వామివారి గ్రామోత్సవం

కర్ణాటక భక్తుల కోసం శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో విశేష పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవం చేపట్టారు. బండిఆత్మకూరు మండల పార్నపల్లెకు చెందిన కళాకారులు కోలాటం నృత్యాలు ప్రదర్శించారు.

పోలీసుల పనితీరుపై విమర్శలు

లక్షలాదిగా తరలివచ్చిన కన్నడిగుల రద్దీతో ఆలయంలోని క్యూలైన్లలో తోపులాటలు చోటు చేసుకున్నాయి. తెలంగాణకు చెందిన భక్తులు ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఫోన్‌పే లేదంటూ ఏఈఓ వై.మధుతో గొడవపడ్డారు. రాజగోపురం వద్ద మెయిన్‌గేటు తెరవాలంటూ కన్నడిగులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇన్ని సంఘటనలు జరిగినా బందోబస్తుకు వచ్చిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహిచడం విమర్శలకు తావిచ్చింది. ఆలయంలో ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు పోలీసులు సెల్‌ఫోన్లలో నిమగ్నమయ్యారు.

అటవీశాఖ ఉద్యోగుల అక్రమ వసూళ్లు

మహానంది: మహానందికి వచ్చే కన్నడ భక్తులు చాటలు, పట్టుడు కర్రలు కొనడం వారి సంప్రదాయంలో భాగం. దీంతో కర్రలు, చాటలు అమ్ముకుని జీవనం సాగించే నిరుపేదలైన చెంచు, ఎరుకలి, మేదర కుటుంబాలకు చెందిన వారు ప్రతిఏడాది వాటిని అమ్ముకునేందుకు మహానందికి వస్తారు. దేవస్థానం ప్రాంగణంలో అమ్ముకునేందుకు దేవస్థానానికి ఒక్కో కుటుంబం వారు రూ. 2వేల వరకు చెల్లించి అనుమతి తీసుకుంటారు. అయితే ఓ అటవీశాఖ అధికారి, సిబ్బంది పేదల నుంచి చేతివాటం ప్రదర్శించడం విమర్శలకు తావిచ్చింది. ఒక్కొక్క చాటకు రూ. 2.50 నుంచి రూ. 5 వరకు వసూలు చేస్తున్నారని, ఒక్కొక్కరి నుంచి రూ. 500 వరకు వసూలు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అటవీశాఖ మహానంది డీఆర్‌ఓ సుబ్బయ్య, ఎఫ్‌బీఓ ప్రతాప్ మాట్లాడుతూ వసూళ్లు చేయలేదని చెప్పారు. నిబంధనల ప్రకారం చలానా రూపంలో మాత్రమే తీసుకున్నారని, వీఎస్‌ఎస్‌కు అనుమతి ఇచ్చి రూ. 40,500 చలానాలు కట్టినట్లు చెప్పారు.

పాదరక్షల తరలింపుపై భక్తుల వాగ్వాదం

మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన కర్ణాటక భక్తుల్లో అత్యధికులు పేదవారు. అయితే వారి పాదరక్షలను వదిలేందుకు కాంట్రాక్టర్ డబ్బులు అడగటంతో వారు నిరాకరించి ఆలయ ప్రాంగణంలో చెప్పులు వదిలివెళ్లారు. దర్శనం పూర్తయి వచ్చేసరికి అవి కనిపించకపోవడంతో భక్తులు వాగ్వాదానికి దిగారు.

డీలర్‌పై చర్యలు తీసుకుంటాం

నందికొట్కూరు: మూడు నెలల నుంచి బియ్యం పంపిణీ చేయకుండా పక్కదారి పట్టించిన డీలర్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ దాసు స్పష్టం చేశారు. గురువారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో రెండు వార్డుల ప్రజలకు మూడు నెలల నుంచి బియ్యం పంపిణీ చేయడం లేదని చేసిన ఫిర్యాదుపై ఆయన విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బియ్యం పంపిణీ చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఆర్‌ఐ, విఆర్వో, తదితరులు పాల్గొన్నారు.



బియ్యం పంపిణీపై విచారణ చేస్తున్న ఆర్డీఓ దాసు

ఈ వీఆర్వో మాకొద్దు

వీఆర్వో మౌలిబాషా తమ గ్రామానికి వద్దంటూ ఆర్డీఓ దాసుకు బిజినవేముల గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు. వీఆర్వో తమ గ్రామానికి ఎప్పుడు వస్తాడో... పోతాడో తెలియదంటూ విన్నవించుకున్నారు. వేరే వీఆర్వోను తమ గ్రామానికి వేయాలని ఆర్డీఓ కోరారు.

రాగిజావ అందించడం హర్షణీయం



మాట్లాడుతున్న రాజునాయక్

ఆత్మకూరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందించడం హర్షణీయమని రాష్ట్ర గిరిజన ప్రజా సమాఖ్య అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్న ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్, మల్లేష్‌నాయక్, బాలునాయక్, రాముునాయక్ పాల్గొన్నారు.

జీవనోపాధి మెరుగుపర్చుకోండి

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న వైఎస్సార్ ఆసరా మొత్తంతో పొదుపు మహిళలు జీవనోపాధి మెరుగుపర్చుకోవాలని ఏపీఎం అంబమ్మ సూచించారు. గురువారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో వైఎస్సార్ ఆసరాపై సర్పంచ్ శ్యామలమ్మ అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ఈనెల 25న మూడో విడత వైఎస్సార్ ఆసరా మొత్తాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేయనున్నట్లు తెలిపారు.

గౌడ కులస్తులకు అండగా ఉంటాం

నందికొట్కూరు: గౌడ కులస్తులకు అండగా జై గౌడ సేన ఉంటుదని జై గౌడసేన ఆంధ్రరాష్ట్ర యువజన అధ్యక్షుడు జవ్వాజి చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. గురువారం కొణిదెల గ్రామంలో వారు గీతకార్మికులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. గీత వృత్తిదారుల లైసెన్సులపై కల్లు షాపులు పెట్టుకోకుండా ఎక్సైజ్ అధికారులు అడ్డు కోవడం వల్ల కొణిదేల గ్రామ గీత కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఒక్క లైసెన్సుకు రూ.50వేలు నుంచి లక్ష రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు.

ముస్లింలకు సహేరి సౌకర్యం

ఆత్మకూరు: రంజాన్ మాసంలో వేకువజామున సహేరి సౌకర్యం కల్పించామని, ముస్లిం సోదరులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, తెలంగాణ బీజేపీ మైనార్టీ మోర్చా కన్వీనర్ షబానా, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మున్నా కోరారు. పట్టణంలోని స్పోర్ట్స్ క్లబ్ కార్యాలయంలో గురువారం సహేరి పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ఇస్లాం శాంతిని బోధిస్తుందని, ప్రతి ఒక్కరు ప్రశాంతంగా జీవించాలన్నారు. వేకువజామున 2 నుంచి 4 గంటల వరకు తమ గృహాలకు పంపాలని కోరితే భోజనాలను తీసుకువచ్చి ఇస్తామని చెప్పారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. షేక్ అహ్మద్, గౌస్‌పీరా, మునీర్, అల్లిషేక్, మున్నా, యూసుఫ్ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి కల్యాణకట్ట నాయీబ్రాహ్మణ సంఘం వారు గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి కల్యాణకట్ట వద్ద క్షీరాభిషేకం చేశారు. సంఘం అధ్యక్షుడు మాయలూరి సాయిబాబ మాట్లాడుతూ జీతాల పెంపుపై ఏళ్లతరబడిగా ఎదురు చూస్తున్న నాయీ బ్రాహ్మణులకు జీఓ నెంబర్ 110ను విడుదల చేసి రూ.20 వేలు నెలసరి వేతనం వచ్చే విధంగా చేసిన సీఎంకు, ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కూలీలను ఆదుకుంటాం

జూపాడుబంగ్లా: ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడిన ఉపాధి కూలీలు వడ్డె రమణమ్మ, వడ్డె వెంకటలక్ష్మమ్మలను ఆదుకుంటామని ఏపీఓ గౌరీబాయి తెలిపారు. ఈనెల 21న ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలను బస్సు ఢీకొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని గురువారం ఏపీ?ఓ పరామర్శించారు. తన వంతుగా కొంత మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం

ఆత్మకూరు: స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ రాజ్‌గురుల ఆశయాలను కొనసాగించాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు రణధీర్, నరసింహనాయక్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గురువారం వారి వర్ధంతి సభను నిర్వహించారు. డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సుదర్శన వర్మభవనం నుంచి గౌడ్‌సెంటర్, కొత్తబస్టాండ్ వరకు కాగడ ప్రదర్శన నిర్వహించారు.

సాక్షినెట్‌వర్క్ : నందికొట్కూరులో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మద్రిస్వామి ఆధ్వర్యంలో గవర్నమెంట్ హైస్కూల్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. పాములపాడులో సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న ఆధ్వర్యంలో, బండిఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో, జూపాడుబంగ్లా మండలంలోని భాస్కరాపురం గ్రామంలో ఏఐటీయూసీ నాయకుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో, శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలోని రింగ్‌పార్క్ సెంటర్‌లోని భగత్‌సింగ్ విగ్రహానికి ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఆత్మకూరులో కాగడాలతో నివాళులర్పిస్తున్న దృశ్యం

క్రైం కార్నర్

విద్యార్థిని మింగిన నీటికుంట



గుంతలో నుంచి విజయ్‌ను బయటికి తీసుకొస్తున్న గ్రామస్తులు

మహానంది: పంట పొలాల్లోని గుంతల్లో ఉన్న నీళ్లలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గుంత పూడికలో ఇరుక్కుపోయి ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన గోపవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చుట్ల విజయుడు ఆలియాస్ విజయ్(13) స్థానిక జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బడికెళ్లిన విజయ్ మధ్యాహ్నం ఇంటికి వచ్చి అన్నం తిని స్నేహితులతో కలిసి ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న పంటపొలాల్లోని గుంతల్లో ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు విజయ్ కుంటలోని పూడికలో ఇరుక్కుపోవడంతో బయటికి రాలేకపోయాడు. దీంతో తోటి పిల్లలు కేకలు వేస్తూ కాలనీకి వెళ్లి విషయం తెలపడంతో కాలనీవాసులు పెద్దసంఖ్యలో గుంతలవద్దకు చేరారు. కొందరు గుంతలోకి దిగి విజయ్‌కోసం గాలించారు. అప్పటికే కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. చుట్ల మరియన్న, జయమ్మలకు కుమార్తె, కుమారుడు ఉండగా, కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తమ కుమారుడిపై ఎలాంటి ఫిర్యాదు, పోస్టుమార్టం వద్దని తల్లిదండ్రులు పోలీసులకు విజ్ఞప్తి చేయడంతో వెనుదిరిగారు.

సెల్‌ఫోన్ తీసుకున్నాడనే అనుమానంతో..

- యువకుడిని చెట్టుకు కట్టేసి చితకబాదిన స్నేహితులు

జూపాడుబంగ్లా: తన సెల్‌ఫోన్ తీసుకున్నాడనే అనుమానంతో ఓ యువకుడిని చెట్టుకు కట్టేసి ముగ్గురు వ్యక్తులు కర్రలు,రాడ్లతో ఒళ్లంతా కందిపోయేలా చితకబాదిన ఘటన మండలంలోని తరిగోపుల గ్రామంలో చోటుచేసుకొంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలు ఇలా... గ్రామానికి చెందిన వడ్డెశివకృష్ణ, మాలశివ, దేవ అలియాస్ డ్యానీ ముగ్గురు స్నేహితులు. ఈనెల 21న రాత్రి మాలశివ, దేవ(డ్యానీ) మందుతాగుదామంటూ ఇంటివద్ద ఉన్న వడ్డెశివకృష్ణను పిలుచుకొని వెళ్లారు. గ్రామానికి సమీపంలోని కేసీ కాల్వ వద్ద ముగ్గురు కలిసి మద్యం సేవించసాగారు. కొద్దిసేపటికి దేవ(డ్యానీ) సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో వడ్డెశివకృష్ణ తీసుకొని దాచేశాడని అనుమానించారు. మద్యం మత్తులో దేవ, మాలశివలు వడ్డెశివకృష్ణను చెట్టుకు కట్టేసి పిడిగుద్దులు గుద్ది, కర్రలు, రాడ్లతో శరీరం కందిపోయేలా కొట్టారు. వీరికి సుంకన్న అనే మరోవ్యక్తి జతకావడంతో ముగ్గురు కలిసి చితకబాదారు. ఇదిలా ఉండగా శివకృష్ణ తండ్రి మరణించడం, తల్లి బతుకు తెరువుకోసం హైదరాబాదుకు వెళ్లడంతో పూరిగుడిసెలో ఒక్కడే ఉంటూ హోటళ్ల వద్ద పనులు చేసి, పెట్టింది తింటూ కాలం వెళ్లదీస్తున్నాడు. శివకృష్ణను చితకబాదిన విషయం తరువాతి రోజు (బుధవారం) తెలుసుకున్న గ్రామానికి చెందిన వడ్డెర కులస్తులు అతన్ని కొట్టిన వారి ఇళ్లవద్దకు వెళ్లారు. దీంతో వారి బంధువులు, కులస్తులు ఏకం కావటంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను తరిమేశారు. తీవ్రంగా గాయపడిన వడ్డెశివకృష్ణను గురువారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే బాధితుడు తనపై దాడిచేసిన వారిపైన ఫిర్యాదు చేయకపోవటంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.



గాయపడిన వడ్డె శివకృష్ణ

పోలీసుస్టేషన్ చేరిన పది ప్రశ్నపత్రాలు

జూపాడుబంగ్లా/కొత్తపల్లి/మిడుతూరు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు గురువారం ఆయా మండలాల పోలీసుస్టేషన్లకు చేరాయి. పోలీసు సెక్యూరిటీతో ప్రత్యేక వాహనంలో తెచ్చిన ప్రశ్నాపత్రాలను రూట్ ఆఫీసర్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు అందజేశారు. వారు ప్రశ్నాపత్రాలను పరిశీలించి సబ్‌జెక్టు వారీగా విడివిడిగా ట్రంకు పెట్టెల్లో ఉంచి వాటిని సీజ్‌చేసి పోలీసుస్టేషన్‌లో భద్రపరిచారు. సెట్-2 ప్రశ్నాపత్రాలు మరో రెండు రోజుల్లోగా పోలీసుస్టేషన్‌కు చేరనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా జూపాడుబంగ్లాలో విద్యార్థులతో ట్రంకు పెట్టెలను మోయించడం విమర్శలకు తావిస్తోంది.